క్లుప్తంగా

పశు వైద్యులకు సత్కారం



వైద్యులను సత్కరిస్తున్న పద్మనాభం, తదితరులు

బొబ్బిలి: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో పశువైద్యాధికారులను గురువారం సన్మానించారు. ఉప ఖజానాధికారి పి.వి.పద్మనాభం ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎల్.విష్ణు, వైద్యులు అప్పలనాయుడు, సురేష్, అనితను సత్కరించారు. ఈ సందర్భంగా పద్మనాభం మాట్లాడుతూ గోవులు, మూగజీవాలకు వైద్యం అందిస్తూ వాటి ప్రాణాలను కాపాడుతున్న వైద్యులకు ఎంత చేసినా తక్కువేనని అన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

మెంటాడ: మండలంలోని కుంటినవలస గ్రామంలో సిద్ధి వినాయక, దత్తాత్రేయ షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త షేక్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆలయ పూజారి కాశీ కాశి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

బొబ్బిలిరూరల్: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ రెడ్డి వేణు లబ్ధిదారులు సూచించారు. చింతాడ,కలవరాయి తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో గురువారం ఆయన పర్యటించారు. లబ్ధిదారులతో సమావేశమై ఈ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈ అల్లు సూర్యనారాయణ,హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

ఐడీ కార్డుల పంపిణీ



ఐడీ కార్డులు చూపిస్తున్న కంచరాం ఉన్నత పాఠశాల విద్యార్థులు

రాజాం సిటీ: స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, మండలంలోని కంచరాం, బొద్దాం, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రాజాం పట్టణానికి చెందిన కొత్తా సత్యనారాయణమూర్తి, కొత్తా సాయిప్రశాంత్ కుమార్ ఐడీ కార్డులు సమకూర్చారు. కంచరాంలో 110 మందికి, బొద్దాంలో 50 మందికి, పోలీసుస్టేషన్ రోడ్డు పాఠశాలలో 100 మంది వాటిని గురువారం అందజేశారు. హెచ్‌ఎం వి.వి.వసంతకుమార్, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, కొత్తా నందన్, పెంకి చైతన్యకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వే పరిశీలన

వంగర: గ్రామాల్లో స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్. రఘునాథాచారి సచివాలయ సిబ్బందికి సూచించారు. తలగాం గ్రామంలో సచివాలయ సిబ్బంది గురువారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎనిమిది పంచాయతీలు స్వమిత్వ సర్వేకు ఎంపికయ్యాయని చెప్పారు. ఆయా గ్రామాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలు, గ్రామ కంఠాలను, ప్రజల ఆస్తుల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ ఒక్కరిలో దేశభక్తి పెంపొందాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గిరీష్

రాజాం సిటీ: ప్రతీ ఒక్కరిలో దేశభక్తి పెంపొందాలని జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ అన్నారు. స్వాతంత్ర వేడుకల్లో భాగంగా జీఎంఆర్ ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎంతోమంది మహానుభావులు తమ జీవితాలను, ప్రాణాలను త్యాగం చేశారని, వారందరినీ గుర్తుచేసుకునేందుకు ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అసోసియేట్ డీన్ వి.రాంబాబు, పీడీ బీహెచ్.అరుణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డాక్టర్ కె.వి.ఎస్.ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రోజూ క్లోరినేషన్ చేయాలి

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల్లో రోజూ క్లోరినేషన్ చేయాలని, 15 రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయాలని డీడీఓ కిరణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని జగన్నాథపురం, కలవరాయి, కోమటిపల్లి తదితర గ్రామాల్లో ఎంపీడీఓ రవికుమార్‌తో కలిసి గురువారం పర్యటించారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకు లను పరిశీలించి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి పలు సూచలను చేశారు.ఆయా గ్రామాల్లో చెత్త సేకరణను పరిశీలించారు. అలాగే స్వమిత్ర సర్వేపై సిబ్బందిని ఆరా తీశారు.

కంట పడితే.. వెంటపడుతున్నాయి

- శునకాల స్వైర విహారం
- చిన్నారులు, వృద్ధులపై దాడులు
- వాహనాల వెంట పడి తరుముతున్న వైనం
- కుక్కల దాడిలో మృత్యువాతపడుతున్న మూగజీవాలు
- నియంత్రణ చర్యలు శూన్యం



రాజాంలో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న వీధికుక్కలు



అప్పలఅగ్రహారంలో కుక్కలదాడిలో మృతిచెందిన గొర్రెలు (ఫైల్‌ఫోటో)



కుక్కలదాడిలో గాయపడిన చిన్నారి(ఫైల్‌ఫోటో)

రాజాం: రాజాం పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామాల్లో, ప్రధాన రహదారులపై వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ పిల్లలు, వృద్ధులు, పాడిపశువులు, మూగజీవాలు, కోళ్లపై దాడులు చేస్తున్నాయి. ఇటు మున్సిపల్ అధికారులతో పాటు అటు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు వీటి నియంత్రణపై దృష్టిసారించకపోవడంతో సమస్య తీవ్రతరంగా మారుతోంది.

రాత్రైతే ప్రయాణాలు ప్రమాదం

రాజాం పట్టణంలో ప్రధాన రహదారిపై పాలకొండ రోడ్డు డోలపేట, శ్రీకాకుళం రోడ్డులో ఎల్‌ఐసీ కార్యాలయం, ఇటు బొబ్బిలి జంక్షన్‌ల సమీపంలో కుక్కల సంచారం అధికంగా ఉంది. మాధవబజార్, శ్రీనివాసరోడ్డు, ఠాణా వీధి, గాయత్రీకాలనీ ప్రాంతాల్లో వీటి బెడద చాలా ఎక్కువ. రేగిడి వెళ్లే రోడ్డులో ఉంగరాడమెట్ట, శిర్లాం, బూరాడ, గురవాం జంక్షన్‌లు, సంతకవిటి రోడ్డు లో తాలాడ, సంతకవిటి కేంద్రాలు, సిరిపురం, వాసుదేవపట్నం కూడలి, వంగర రోడ్డులో అరసాడ, కాగితాపల్లి, సంగాం జంక్షన్‌ల వద్ద కుక్కలు గుంపులుగా సంచరిస్తూ రాత్రి 8 గంటల తర్వా త ఆ మార్గాల్లో ప్రయాణించే వారిని బెంబేలెత్తిస్తు న్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. కొన్ని రకాల కార్లు, ద్విచక్ర వాహనాల సౌండ్, వాహనాల నుంచి వచ్చే పొగకు వెంటపడి తరుముతు న్నాయి. రాత్రి, పగలు అని తేడా లేకుండా ఒంటరిగా ఎవరై నా తారసపడినా, చిన్నారులు, వృద్ధులు ఎదురుగా వెళ్లినా గాయపరుస్తున్నాయి. మేకలు, గొర్రెలు, కోళ్లపై దాడిచేసి చంపేస్తున్నాయి.

అక్కరకు రాని నియంత్రణ చర్యలు

వీధి కుక్కల నియంత్రణలో అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థ పూర్తిగా సిరికన్నువేసింది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు వీటి నియంత్రణ పట్టించుకోవడం లేదు. మున్సిపాల్టీలో ఏడాదికో, ఆరు నెలలకు ఒక దఫా దృష్టిపెడుతు న్నారు. వీధి కుక్కలకు యాంటీ బర్త్ ఇంజెక్షన్‌లు వేయడం ద్వారా వాటి సంతతిని నియంత్రించవచ్చు. వీటికి తోడు ఇళ్లలో పెంచే శునకాలకు వ్యాక్సిన్ వేయడం, వాటి నుంచి కూడా ఉత్పత్తి తగ్గించడం చేయాలి. అలా కాకుం డా చాలా మంది ఇంట్లో పెంపకానికి తీసుకొచ్చిన శునకాలకు ఏదైనా వ్యాధి సోకితే గ్రామాల్లో విడిచిపెట్టేస్తుండడంతో వీటి సంతతి పెరిగి ఇబ్బందిగా మారుతోంది.

ఆ వ్యర్థాలతో చాలా ప్రమాదం

రాజాం పట్టణంతో పాటు గ్రామాల్లో చికెన్ సెంటర్లు చాలా ఎక్కువగా వెలిశాయి. ఈ దుకాణాల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను ప్రధాన రహదారుల పక్కన పడేస్తున్నారు. కుక్కలు గుంపులు గా రోడ్లపై చేరి ఆవ్యర్థాలను తినడం అలవాటుగా మారిపోయింది. ఈవ్యర్థాలు లభించని సమయంలో మాంసానికి అలవాటు పడిన కుక్కలు రైతులు పెంచుకుంటున్న గొర్రెలు, మేకలు, ఆవు దూడలపై దాడులు చేస్తున్నాయి. ఒక్కో సందర్భంలో మనుషులపై కూడా దాడులు చేస్తున్నాయి. ఈ వ్యర్థాలను జాగ్రత్తగా డంపింగ్ యార్డులకు తరలించే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

చాలా ఇబ్బందిగా ఉంది



రాజాం పట్టణంలో ప్రధాన రహదారిలో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. రాత్రిళ్లు రోడ్లపై ప్రయాణించడం ఇబ్బందిగా ఉంటోంది. ఒంటరిగా వెళ్లే వారిపై, ద్విచక్ర వాహనాల వెంట పడి గాయపరుస్తున్నాయి. కుక్కలు గుంపులుగా ఉన్న ప్రాంతాల్లో హారన్ కొట్టి, నెమ్మదిగా ప్రయాణించడం మంచిది.

– కుదమ తిరుమలరావు, రాజాం.

నియంత్రణ లేదు..



గ్రామాల్లో ఎక్కడా కూడా శునకాల నియంత్రణ లేదు. ఇతర ప్రాంతాల నుంచి కుక్కలను తీసుకువచ్చి గ్రామాల్లో విడిచిపెట్టేస్తున్నారు. చికెన్, మటన్ షాపుల వారు వ్యర్థాలను ఎక్కడికక్కడే ప్రధాన రహదారులను ఆనుకుని పడేస్తున్నారు. వీటిని తింటున్న కుక్కలకు పిచ్చి ఎక్కువ అవుతోంది. శునకాల బారిన పడి గాయాలు పాలవుతున్నవారి సంఖ్య గ్రామాల్లో చాలా ఎక్కువగా ఉంది. వీటిని కంట్రోల్ చేయడం, వీధి కుక్కలకు కూడా వ్యాక్సిన్ వేయాలి.

– పొట్నూరు స్వాతికుమార్, చింతలపేట

చర్యలు తీసుకుంటున్నాం



రాజాం మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. యాంటీ బర్త్ వ్యాక్సిన్‌లు నాలుగు నెలల క్రితం వేశాం. మళ్లీ వేస్తాం. వీధి కుక్కలకు కూడా వ్యాక్సినేషన్ వేసి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా దృష్టిపెడుతున్నాం. పెంపుడు శునకాలు వీధిల్లో విడిచిపెట్టకుండా పెంపకందారులకు అవగాహన కల్పిస్తున్నాం. చికెన్, మటన్ షాపుల వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారబోయకుండా చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్. ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, రాజాం మున్సిపాలిటీ

పోలీసుల సహకారంతో ప్రజాస్వామ్యం ఖూనీ



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ పెద్దలు పోలీసుల సహకారంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, పోలీసులు, ఎన్నికల అధికారులు అడ్డదారులు తొక్కారని, టీడీపీ నాయకులకు సహకరించి దగ్గరుండి రిగ్గింగ్ చేయించారని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆరోపించారు. రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్టలో జెడ్పీటీసీ ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయని అన్నారు. వైఎస్సార్‌సీపీని ఓడించేందుకు ఎన్నికల అధికారులు, పోలీసులు అడ్డదారులు తొక్కారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అడ్డుకుని పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి కొమ్ముకాయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రౌడీలను పురమాయించి దాడులు చేయడం, దొంగ ఓట్లు వేయడం, పలువురు అసలైన ఓటర్లను అడ్డుకోవడం అప్రజాస్వామ్యానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. కూటమి అడ్డదారులు తొక్కుతోందని, పూర్తిగా ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేసి, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని చెరిపేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం, హిట్లర్ పాలన కనిపిస్తోందని, ప్రజలు ఓపిక, సహనంతో చూస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పార్టీ కల్చరల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర, సర్పంచ్‌ల వింగ్ రాజాం కన్వీనర్ వాకముల్ల చిన్నంనాయుడు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

రాజాం సిటీ: ఈనెల 23 నుంచి 25వరకు ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. మహాసభల వాల్ పోస్టర్లను రాజాంలో సీపీఐ నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి సీపీఐ నిరంతరం పోరుబాటు పడుతోందని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై, దళిత మైనార్టీలపై జరుగుతున్న దాడులపై, ఇళ్లు, భూమిలేని నిరు పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసిన చరిత సీపీఐది అని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, సింగారపు కనకరాజు, రామారావు పాల్గొన్నారు.

లక్ష్మునాయుడుకి నివాళి



లక్ష్మునాయుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండల కేంద్రానికి చెందిన రైతు సంఘం నాయకుడు శాసుబిల్లి లక్ష్మునాయుడి సంస్మరణ సభను మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావునాయుడు హాజరై లక్ష్మునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి లక్ష్మునాయుడు అని అన్నారు. మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు, మామిడి జగన్నాథంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సంగం మాస్టారును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం సిటీ: మండల పరిధి ఆగూరు గ్రామానికి చెందిన ఇద్దుబోయిన సంగం మాస్టారు ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ గురువారం సంగం మాస్టారు నివాశానికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, సర్పంచ్ కోనారి అప్పారావు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, డాక్టర్ నరేంద్ర, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సేంద్రియ సేద్యమే మేలు



పలుపత్ర ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, ప్రకృతివ్యవసాయ సిబ్బంది

బొబ్బిలిరూరల్: సేంద్రియ సేద్యమే అన్ని విధాలా మేలని మండల వ్యవసాయ అధికారి మజ్జి శ్యామసుందర్ అన్నారు. గోపాలరాయుడుపేట గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పలుపత్ర ద్రావణం తయారీ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఓ శ్యామసుందర్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువులు, పురుగు మందులను వాడిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకర పంట ఉత్పత్తులను సాధించగలమని అన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శంకరరావు, శ్రీను, వీఏఏ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



రాజాం : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు



సంతకవిటి: వైజ్ పాఠశాలలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు

రాజాం/సంతకవిటి: రాజాం పట్టణంలోని రెయిన్‌బో స్కూల్, సంతకవిటిలోని వైజ్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు గోపాలకృష్ణ, జి.ప్రసాదరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్డన్ సెర్చ్

రేగిడి: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని గుళ్లపాడు, ఉంగరాడ, లింగాలవలస, చిన్నలింగాలవలస తదితర గ్రామాల్లో ఎస్‌ఐ పి.నీలావతి, పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో సోదాలు చేశారు. పెరటి తోటల్లో గంజాయి పెంపకం వంటివి చేపడుతున్నారేమోనని పరిశీలించారు.

తూతూమంత్రంగా సాగునీటి కాలువల్లో పూడిక తీత



మాట్లాడుతున్న వేమిరెడ్డి, తదితరులు

బొబ్బిలి: సాగునీటి కాలువల్లో పూడిక తీత, పిచ్చి మొక్కల తొలగింపుల పనులను ఇరిగేషన్ అధికారులు తూతూ మంత్రంగా చేపడుతున్నారని, ఈ పనులతో ఎవరికి ఉపయోగమని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ప్రశ్నించారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా వర్షాకాలం రాకముందే సాగునీటి కాలువల్లో పూడిక తీత, మరమ్మతులు చేపడతారని, కానీ జిల్లాలోని ఇరిగేషన్ అధికారులు మాత్రం వర్షాకాలం ప్రారంభమయ్యాక కాలువల్లో సిల్టు తీయించే పనులు, తుప్పలు తొలగించే పనులు ప్రారంభించారన్నారు. వర్షాకాలంలో పనులు ప్రారంభించడం, రెండు రోజుల పాటు పనులు చేయడం తర్వాత వీలు కాలేదని నిలిపివేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇలాంటి అరకొర పనుల వల్ల కాలువల పరిధిలోని సగం ఆయకట్టుకు కూడా సక్రమంగా సాగునీరు అందడం లేదన్నారు. అందుకే చాలా చోట్ల కాలువలు గండ్లు పడుతున్నాయన్నారు.మరో పక్క నీటిని పక్కకు మళ్లిం చేస్తున్నారన్నారు.పాలకులు పట్టించుకోకపోవడం వల్లె అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. మరో పక్క ఏదో అవస్థలు పడి ఉభాలు పూర్తి చేసుకున్న రైతులకు యూరియా వంటి ఎరువులు కూడా ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు కూడా 70 శాతం మాత్రమే అందాయని, మిగిలిన 30 శాతం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రైతులందరికీ రైతు భరోసా పథకం కింద సాయం అందేదని, అదే మాదిరిగా రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చూడాలన్నారు. రైతు సంక్షేమ సంఘ కార్యవర్గ సభ్యులు తమ్మిరెడ్డి కృష్ణ, రెడ్డి సత్యం, రాంబార్కి తిరుపతిరావు, వజ్జి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల్లో చంద్రబాబుది గిన్నీస్ రికార్డు

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: అబద్ధాలు చెప్పడం, మోసగించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుది గిన్నీస్ రికార్డు అని వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గ సమన్వ యకర్త,మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా శంబంగి వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్నికల్లో కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలు అమలవుతు న్నాయా అని మహిళలను ఆరా తీశారు. మహిళలు స్పందిస్తూ ఏ హామీలూ అమలు కావడం లేదని సమాధానమిచ్చారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు తమకు అందేవని, పథకాల నగదు తమ బ్యాంకు అకౌంట్లలో జమయ్యేవని చెప్పారు. ఇప్పుడు అంతా గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. శంబంగి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో పాటు సూపర్‌సిక్స్ హామీలను కూడా అమలు చేస్తామని చెప్పిన టీడీపీ కూటమి ఇప్పుడు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు.మున్సిపల్ మాజీ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, ఎస్.వి.మురళీకృష్ణారావు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, వార్డు ఇన్‌చార్జ్ పోల చిన వెంకట రమణ,పట్టణంలోని పలువురు వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు అవకాశం

బాడంగి: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లు పొందేందుకు ఈనెల 20వ తేదీవరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందని ఎంఈఓ–2 రాజేశ్వరి తెలిపారు.స్థానిక ఎమ్మార్సీ వద్ద నోటీస్ బోర్డులో సంబంధిత ప్రకటనకు చెందిన ప్రతిని ప్రదర్శించారు. ఆర్‌టీఈ 12(1)సి–2009 చట్టంప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25శాతం ఉచిత సీట్లు పొందవచ్చని పేర్కొన్నారు. అర్హులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఎమ్మార్సీలో సంప్రదించాలని సూచించారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి

రాజాం: సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు చెప్పారు.రాజయ్యపేట, ఆగూరు గ్రామ సచివాలయాల్లో గురువారం ఆయన తనిఖీలు చేశారు. గత మూడు నెలల్లో సచివాలయాల్లో అందించిన సేవలపై ఆరా తీయడంతో పాటు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో తాగునీటి బోరుబావులను పరిశీలించి, క్లోరినేషన్ చేయించారు.

పిల్లలందరికీ దేశనాయకుల పేర్లు



చింతల తిరుపతిరావు, కమ్యూనిస్టు వాది

రామభద్రపురం: మండలకేంద్రానికి చెందిన కమ్యూనిస్టు వాది చింతల తిరుపతిరావు తన పిల్లలందరకీ వివిధ దేశాల నాయకుల పేర్లు పెట్టి దేశభక్తిని చాటుకున్నాడు. ఆయనకు ఐదుగురు పిల్లలు కాగా వారిలో ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమారునికి హోచ్‌మన్, రెండవ కుమారునికి లెనిన్, మూడవ కుమారునికి భగత్ సింగ్, మొదటి కుమార్తెకు ఇందిరాగాంధీ, రెండవ కుమార్తెకు ఝాన్సీలక్ష్మి అని పేర్లు పెట్టారు. పెద్దకుమారుడు హోచ్‌మెన్ తన తండ్రి దేశభక్తికి చిహ్నంగా రామభద్రపురం మండల కేంద్రంలోని బైపాస్‌రోడ్డు కూడలిలో సొంత నిధులతో 1999లో గాంధీ విగ్రహం ఏర్పాటుచేశారు. ఈ ప్రాంతంలో ఇదే మొదటి విగ్రహం కావడం గమనార్హం.

ఏడు నెలలుగా అందని వేతనాలు



ఎంఈఓ దుర్గారావుకు వినతిపత్రం అందజేస్తున్న వంట నిర్వాహకులు

రాజాం సిటీ: మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బకాయి బిల్లులు, వేతనాలు అందించాలని కోరుతూ వంట నిర్వాహకులు మండల కార్మిక సంఘాల నాయకుడు సీహెచ్.రామ్మూర్తినాయుడుతో కలిసి ఎంఈఓ వై.దుర్గారావుకు గురు వారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లోని 9, 10 తరగతుల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాలకు సంబంధించిన బిల్లులు, వంట నిర్వాహకులకు వేతనాలు ఏడునెలలుగా అందించకపోవడం దారుణమని అన్నారు. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతుండడం, మెనూ బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. వంట నిర్వాహకులు హైమావతి, లక్ష్మి, రమణమ్మ, చిన్నమ్మడు పాల్గొన్నారు.